ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 20 అక్టోబరు 2024


- మెడికల్ కాలేజీకి ఆర్టీసీ బస్సుల్లో, ఆటోలో వెళ్లా..
- మెడిసిన్ చదివేటప్పుడే నజీర్‌తో ప్రేమలో పడ్డా..
- పేదలకు సేవ చేసేందుకే ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరాను..
- చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉండేది..
- పార్లమెంటులో అడుగుపెట్టిన రోజు మరిచిపోలేను..
- ఎంపీగా గెలవడం కన్నా.. పేదలకు మేలు చేయడమే మిన్న..
- రాజకీయాల్లో నాన్న చూపిన దారే నాకు రహదారి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో 'ఆంధ్రజ్యోతి ఇన్నర్ వ్యూ'

ఫీజు కట్టలేక స్కూల్లో నిలుచున్నా..

రాజకీయాల్లో ఉన్నా.. నాన్న కారు కూడా కొనలేదు..

7

ఇన్నర్ వ్యూ



పేరుమోసిన ప్రజాప్రతినిధి గారాల పట్టి ఆమె. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా, ఉప ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి కూతురికి ఎన్నో రాజభోగాలు ఉంటాయని సహజంగా అనుకుంటాం. కానీ ఆమె బాల్యం నుంచి వైద్యురాలి వరకు సాధారణ జీవితాన్నే గడిపింది. పాఠశాలల్లో ఫీజు కట్టలేక ఉపాధ్యాయులు నిల్చోబెట్టిన రోజులు ఆమె కళ్ల ముందు ఇంకా కదలాడుతూనే ఉన్నాయి. మెడికల్ కాలేజీకి ఆర్టీసీ బసుల్లో, ఆటోల్లో వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. డాక్టర్‌గా లక్షలు సంపాదించుకునే మార్గం ఉన్నా.. పేదలకు వైద్యం అందించాలని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరారు. ఎంతోమంది నిరుపేదలకు వైద్యం అందించి ప్రాణాలు నిలిపారు. అలాగే రాజకీయాల్లో నీతి, నిజాయితీ, విలువలకు కట్టుబడి ఉండాలని తండ్రి చెప్పిన మాటలే ఆమెకు స్ఫూర్తినిచ్చాయి. ఫలితంగా రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. తండ్రికి కొడుకులు లేని లోటు పూడ్చేందుకు రాజకీయ వారసురాలిగా అరంగేట్రం చేసి తొలి ఎన్నికల్లోనే విజయం సాధించి సత్తా చాటారు. గెలుపుకంటే ప్రజాసేవే పరమావధి అనుకుని.. వారి అభివృద్ధికి పాటు పడతానని చెబుతున్నారు వరంగల్ లోక్‌సభ సభ్యురాలు కడియం కావ్య. ఆమె జీవితంలో చోటు చేసుకున్న కొన్ని సంఘటనలను 'ఆంధ్రజ్యోతి ఇన్నర్ వ్యూ'లో పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



శనిగపురంలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

నాణ్యత ప్రమాణాలతో పనులు
పూర్తి చేయాలి

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులను చేపడుతూ త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని శనిగపురంలో సీడీపీ నిధులు రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న సైడ్‌కాల్వ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మానుకోట అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ బానోత్ హరిసింగ్, తోట మల్లయ్య, శ్రీను, లక్ష్మణ్ పాల్గొన్నారు.



పెద్దవంగరలో గాలివానకు నేలవాలిన వరి

జిల్లాలో ఉరుములు,
మెరుపులతో వర్షం

- తొర్రూరు మండలంలో భారీ వాన
- నేలవాలిన వరిపంట.. పత్తి చేన్లకూ నష్టం

- వివరాలు 6వ పేజీలో..

భయం.. భయం
ఊపిరి తీస్తున్న పిడుగులు

- హడలెత్తిస్తున్న ఉరుములు, మెరుపులు
- వణుకుతున్న జిల్లా ప్రజలు
- ప్రకృతి వైపరీత్యాలతో చోటు చేసుకుంటున్న ఘటనలు
- సైన్స్‌పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?

మహబూబాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాలు సహజమే. శీతోష్ణస్థితిలో వచ్చే మార్పులకు అనుగుణంగా అకాలవర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన బీభత్సవాలు మానవ జీవితాలపై ఎంతో ప్రభావితం చేస్తున్నాయి. ఎండకాలాన్ని తలపించే ఉష్ణోగ్రతలు హడలెత్తిస్తున్న క్రమంలో గత కొన్నిరోజులుగా అకాల వర్షాలతో పాటు ఎక్కడో ఓ చోట పిడుగుపాటుకు పలువురు ప్రాణాలు వదులుతున్నారు. పశువులు సైతం మృత్యువాత పడుతున్నాయి. గత కొన్నిరోజులుగా ఎండలు దంచికొడుతూనే ఉన్నాయి. హఠాత్తుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని, ఒక్కసారిగా ఉరుములతో పిడుగుల వాన భయోత్పాన్ని సృష్టిస్తోంది. ఉన్నట్టుండి కుండతో నీళ్ల కుమ్మరించినట్లుగా ఏదో ఒక ప్రాంతంలో వర్షంపడి ఆ వెంటనే ఎండకొడుతోంది. మొత్తానికి హఠాత్తుగా వాతావరణంలో మార్పులు, జన జీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విజ్ఞాన పరంగా తెలుసుకోవాల్సిన ఉరుములు, పిడుగుల అంశంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ఇంట్లో, బయట జాగ్రత్తలు..

ఒకసారి పిడుగు పాటు సంభవించిందంటే దాని విద్యుత్ ఘాతానికి గురి కాకుండా తప్పించుకొని దూరంగా వెళ్లడమనేది అసాధ్యం. ఎమంటే ఈ చర్యంతా జరగడానికి పట్టే సమయం సెకనులో 10వ వంతు మాత్రమే. ఒక చర్యకు మానవుడు ప్రతిస్పందించే సమయం కూడా అంతే ఉంటుంది. మెరుపులు, ఉరుములు, పిడుగుల గురించి విజ్ఞానాన్ని కలిగి ఉంటే మెరుపులు, పిడుగులు సంభవిస్తే ఎదురయ్యే ఆపదలను తగ్గించవచ్చు. అందుకోసం ప్రత్యేక ప్రాంతంలో, ప్రత్యేక కాలంలో రోజులో ఏ సమయంలో ఈ మెరుపులు, పిడుగులు సంభవించే అవకాశం గరిష్ఠంగా ఎప్పుడు ఉంటుందో తెలుసుకోవాలి. మనం అనుకోకుండా ప్రమాదంలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి ఈ విజ్ఞానం సహాయపడుతుంది.

పిడుగుల నుంచి రక్షణ..

ఉరుములు, మెరుపులు ప్రారంభం అయినప్పుడు నిర్జన ప్రదేశంలో ఉంటే సురక్షితమైన ప్రదేశానికి వెళ్లి తలదాచుకోవాలి. ఆ సమయంలో లోహపు వస్తువులను చేతిలో ఉంచుకోవడం సురక్షితం కాదు. వర్షం కురుస్తున్నప్పుడు శరీరం, తలపై ఉన్న కురులు నిక్కబొడుచుకునే లక్షణాలు కలిగాయంటే పిడుగు పడుతుందని గ్రహించాలి. ఆ వెంటనే చేతులు నేలమీద పెట్టకుండా మోకాళ్ల తల వంచి కిందకు కూర్చువాలి. పిడుగులు పడే సమయంలో నీటిలో ఉండడం క్షేమం కాదు. కాల్వలు, నదుల వద్ద ఉండడం అంతకంటే శ్రేయస్కరం కాదు. ఉరుముతున్నప్పుడు సైకిల్ స్కూటర్‌లపై ప్రయాణం చేయడం మంచిది కాదు. ఉరుములు, పిడుగులు పడే సమయంలో ఇంటి స్లాబ్‌పై నీళ్లబుబును, నీటి ట్యాంక్‌ను అనుసంధానం చేసిన వాష్‌బేసిన్‌లు, పైపులను తాకడం లాంటివి చేయకూడదు. అంతేకాదు విద్యుత్ పరికరాలు, టెలిఫోన్ పరికరాలు వీలైనంత వరకు ఉపయోగించవద్దు, మొబైల్ ఫోన్‌ను అత్యవసరమైతే తప్ప వినియోగించకూడదు. విద్యుత్, సెల్‌ఫోన్ టవర్‌ల కింద నిల్చోకూడదు, ఇళ్లలో టెలివిజన్‌లు ఉంటే కేబుల్, ఎలక్ట్రికల్ కనెక్షన్‌లను తొలగించాలి. ఇళ్లలో పొయ్యిల వద్ద ఉండకూడదు, హీటర్‌లు, హెయిర్‌డ్రయిర్‌లు, కంప్యూటర్‌లు, ఇతర సర్క్యూట్‌లో ఉండే వస్తువులు వినియోగించకూడదు. శలతత

పిడుగుపాటుకు ప్రాథమిక చికిత్స..

పిడుగులు పడినప్పుడు చాలామంది శ్వాస ఆడక చనిపోతుంటారు. ప్రధానంగా తలవెనుక భాగంలో ఉండే మెదడు శ్వాస క్రియకు కేంద్రం కావడం వల్ల ఈ భాగానికే ప్రమాదం సంభవిస్తుంది. పిడుగు పాటుకు గురైన వ్యక్తికి కార్డియాక్ మసాజ్ లేదా, నోటిలో నోరుపెట్టి కృత్రిమశ్వాసను అందించాలి.



సీరోలు మండలం అందనాల పాడు మిర్చితోటలో పిడుగుపడి మృతిచెందిన మహిళా రైతు వెంకమ్మ (ఫైల్)



కేసముద్రం మండలం కోరుకొండపల్లి శివారు మేఘ్యాతండాలో పిడుగు పడి మృతి చెందిన లకావత్ మౌనిక



కొత్తగూడమండలం బత్తులపల్లిలో చేనులో పిడుగు పాటుకు గురై మృతి చెందిన రైతు దుర్గం లక్ష్మయ్య (ఫైల్)

జిల్లాలో ఇప్పటి వరకు నలుగురు మృతి

- సీరోలు మండలం అందనాలపాడు గ్రామశివారు మిర్చితోటలో కలుపుతీస్తుండగా ఈనెల 18న మహిళా రైతు పోతురాజు వెంకమ్మ (48)పై పిడుగు పడి అక్కడికక్కడ మృతి చెందింది.
- గూడూరు మండలం బొల్లెపల్లి శివారు ఎస్సీ కాలనీకి చెందిన కోరె తిరుపతమ్మ (50) ఆగస్టు 31న పిడుగు పాటుతో ఇంట్లో మృతి చెందింది.
- మహబూబాబాద్ మండలం బలరాంతండా శివారు గిరిజన రైతు పెద్దపులి ఫకీర్యాకు చెందిన రెండు కాడెడ్లు, లేగ దూడ వ్యవసాయ క్షేత్రంలో అక్టోబరు 14న మృతిచెందాయి. తన వ్యవసాయ క్షేత్రంలో కొట్టంలో కాడెడ్లు లేగ దూడను కట్టి వేయగా పిడుగు పడి మృతి చెందాయి.
- కేసముద్రం మండలం కోరుకొండపల్లి శివారు మేఘ్యా తండాకు చెందిన లకావత్ మౌనిక (23) పత్తిచేనులో పత్తి తీస్తుండగా వర్షం రావడంతో చెట్టుకిందకు వెళ్లింది. ఆ సమయంలో ఆమెపై పిడుగుపడి అక్కడే మృతి చెందింది.
- కొత్తగూడ మండలం బత్తులపల్లి శివారులోని మొక్కజొన్న పంట కాపలాకు వెళ్లిన రైతు దుర్గం లక్ష్మయ్య (65)పై పిడుగు పడి వ్యవసాయ క్షేత్రంలో మృతి చెందాడు.

ఉరుములు, మెరుపుల విజ్ఞానం..

- గురునాథరావు, సైన్స్ కమ్యూనికేటర్, మానుకోట



ఉరుములతో కూడిన నల్లని మేఘాల నుంచి భూమి పైకి ప్రసరించే అత్యంత శక్తివంతమైన, ప్రకాశవంతమైన విద్యుత్ ప్రవాహాన్నే మెరుపు అంటారు. వాతావరణంలో ఉరుములు, మెరుపులతో కూడిన ఈ విద్యుత్ ప్రవాహం మూడురకాలుగా సంభవిస్తుంది. ఒకటి ఒకే మేఘం లోపల అంతర్లీనంగా విద్యుత్ ప్రవాహం. రెండు మేఘాలలో ఒక మేఘం నుంచి మరో మేఘానికి విద్యుత్ ప్రవాహం. మూడు మేఘం నుంచి భూమిపైకి విద్యుత్ ప్రవాహం. ఈ మూడోరకం మేఘం నుంచి భూమిపైకి ప్రసరించే విద్యుత్ ప్రవాహమే పిడుగు. ఇది జీవ వైవిధ్యంపై ప్రభావాన్ని చూపిస్తుంది. అందుకే దీనికి సంబంధించిన దానినే పిడుగుగా పేర్కొంటారు. ఈమెరుపు చాలా వేగవంతమైంది. సెకనులో 1,710 వంతు సమయంలోనే సంభవిస్తుంది. ఈ మెరుపు కొన్ని వేల అంపియర్ల కరెంట్ ప్రవాహాన్ని, అత్యధిక విద్యుత్ ప్రొటెన్షియల్ బేధాన్ని కలిగి ఉంటుంది. 30 వేల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతకు చేరుకుంటుంది. ఈ చర్య గాలిలో షాక్ తరంగాలను పురిగొల్పి ప్రసరిస్తుంది. అదే సహజంగా ఉరుము రూపంలో వినిపిస్తుంది. మెరుపు ఏ సమయంలో ఏ ప్రాంతంలో సంభవిస్తుందని ఊహించడం అసాధ్యం.

మినీ ఇంటర్వ్యూ



మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజ్

ప్రశ్న : మైనర్లు వాహనాలను నడుపుతూ పట్టుబడితే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : మైనర్లు వాహనాలు నడపడం చట్ట ప్రకారం నిషేధం. వాహన తనిఖీలతో పాటు ఎక్కడైనా మైనర్‌లు వాహనం నడుపుతూ కనిపిస్తే వెంటనే 'ఆన్‌లైన్'లో వాహనం ఫొటోల తీసి వాహన నెంబరు ఆధారంగా జరిమానాలను నమోదు చేస్తున్నాం.

ప్రశ్న : మైనర్ వాహనాలు నడిపే విషయం అధికంగా ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి?

జవాబు : మైనర్‌లు ద్విచక్రవాహనాలపై సెల్‌ఫోన్ మాట్లాడుతూ, ముగ్గురు చొప్పున వాహనాలపై తిరుగుతూ అధికవేగంతో నడుపుతున్నట్లు పలుమార్లు గుర్తించాం.

ప్రశ్న : మైనర్ వాహనాలు నడపకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : పాఠశాలలు, కళాశాలల్లో చట్టాలపై ఇటీవలె నిర్వహించిన సదస్సుల్లో మైనర్ వాహనాలను నడపవద్దనే అంశంపై కూడా అవగాహన కల్పించాం. తనిఖీల్లో దొరికిన ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నాం.

-కేసముద్రం, ఆంధ్రజ్యోతి

రైతు భరోసా ఎగవేతపై..
నేడు బీఆర్ఎస్ నిరసనలు

- జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇవ్వాల్సిన వానాకాలం రైతు భరోసా ఎగవేతపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండ గడుతూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామరావు పిలుపు మేరకు ఆదివారం మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహశీల్ కార్యాలయం ఎదుట ఉదయం 10 గంటలకు నిర్వహించతలపెట్టిన నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కవిత కోరారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

- జిల్లా సివిల్ జడ్జి తిరుపతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన పెంపొందిచుకోవాలని జిల్లా కోర్టు సివిల్ జడ్జి యు.తిరుపతి సూచించారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, రాజ్యాంగం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయపరమైన సమస్యలు తలెత్తినప్పుడు అధైర్యపడకుండా చట్టం కల్పించిన హక్కుల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. సమాజంలో చిన్నచిన్న అంశాలకే చాలా మంది పోలీస్‌స్టేషన్లు, కోర్టులచుట్టూ తిరుగుతూ సమయాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండాజీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. సోషల్ మీడియాలో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నవయసులో వివాహం చేసుకోవడం వలన ఆరోగ్యపరమైన, న్యాయపరమైన సమస్యలు వస్తాయని పేర్కొన్నారు.



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న తిరుపతి

భార్యభర్తల మధ్య సరైన అవగాహన లేకపోతే విడాకులు తీసుకుని చాలామంది జీవితాలు నష్టపోతున్నాయని తెలిపారు. ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సులో అధ్యాపకులు స్వాతి, సాదిక్‌అలీ, రవికిరణ్, చొప్పరి శ్రీనివాస్, కిరణ్‌కుమార్, శ్రీను, రియాజ్, సురేందర్, నవీన్‌కుమార్, సరిత, భార్గవి, నాగేశ్వర్‌రావు, సృజన, పూర్ణిమ, రవి, భాగ్యలక్ష్మీ, రమేష్, లక్ష్మీ, కళావతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం

- జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి మరియన్న

నర్సింహులపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పండ్లతోట పెంపకానికి రాష్ట్రప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మరియన్న అన్నారు. జిల్లాలోని నర్సింహులపేట, చిన్నగూడూరు, మరిపెడ, మహబూబాబాద్ మండలాల్లో శనివారం సుడిగాలి పర్యటన చేసినట్లు తెలిపారు. మామిడి, తీగజాతి కూరగాయల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి, కూరగాయల సాగు రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. శీతాకాల సమయంలో మామిడి రైతులు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు పాటించాలని తెలిపారు. పండ్ల తోటలు, కూరగాయల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ అవకాశం కల్పిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోలు, రైతులు ఉన్నారు.



మామిడి తోటను పరిశీలిస్తున్న మరియన్న



టోల్‌ప్లాజాను ప్రారంభిస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ పీడీ దుర్గాప్రసాద్

జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా ప్రారంభం

కాటారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మేడిపల్లి వద్ద జాతీయ రహదారి 353(సీ)పై ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) వరంగల్ ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, డీఈఈ కుమారస్వామి శనివారం ప్రారంభించారు. నాలుగేళ్ల క్రితం చేపట్టిన జాతీయ రహదారిపై ఎన్‌హెచ్‌ఏఐ టోల్ ప్లాజాను ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో అధికారులు టోల్ ప్లాజాను ప్రారంభించారు. నిర్వాహకులు ఫీజును వసూలు చేశారు.ఈ కార్యక్రమంలో ఏఈ ప్రమోద్‌కుమార్, పీఎస్సై రాజన్‌కుమార్, నిర్వాహణ సంస్థ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా జాతీయ రహదారి గుంతలు, గాడీలతో అధ్వానంగా ఉండగా టోల్ ప్లాజా ప్రారంభించడంపై వాహనదారులు, ప్రజలు మండిపడుతున్నారు.

అధికారులతో రైతుల వాగ్వాదం

టోల్ ప్లాజాను ప్రారంభించిన అధికారులతో రుద్రారం, బస్వాపూర్‌కు చెందిన రైతులు వాగ్వాదం చేశారు. టోల్ ప్లాజా విస్తరణ కోసం భూముల సేకరణకు తమను ఇబ్బంది పెడుతూ నోటీసులు ఇవ్వడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయల విలువైన తమ భూములను ఇవ్వబోమని తెగేసి చెప్పారు. దీంతో ఎస్సై అభినవ్ రైతులతో మాట్లాడుతూ భూసేకరణ విషయమై రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు. టోల్‌ప్లాజా వద్ద ఆందోళన చేస్తే ఏమొస్తుందని నచ్చజెప్పడంతో రైతులు శాంతించారు.

మహబూబాబాద్ జిల్లాలో వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌లోని పలు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం శనివారం కురిసింది. దీంతో చిన్నపిల్లలు, పెద్దలు భయాందోళనకు గురయ్యారు. తొర్రూరు, కొత్తగూడ మండలాల్లో భారీ వర్షం కురియగా, మిగతా మండలాల్లో ఓ మోస్తరు వాన పడింది. పలు మండలాల్లో పత్తి ఏరే సమయంలో వర్షాలు కురవడంతో రైతులు నష్టపోతున్నారు. కాతపూత రాలిపోతుండడంతో తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. బలమైన గాలులు వీస్తుండడంతో వరి కోతదశలో నేల వారి ధాన్యం రాలిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా వ్యాప్తంగా ఇలా..

తొర్రూరు మండలంలో భారీ వర్షం కురిసింది. కొత్తగూడ, కేసముద్రం, నెల్లికుదురు, పెద్దవంగర, బయ్యారం, ఇనుగుర్తి, గూడూరు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురియడంతో పాటు ఉరుములు, మెరుపుల శబ్దాలతో దద్దరిల్లింది. అరగంట సేపు బీభత్సం సృష్టించింది. పెద్దవంగర మండలంలో బలమైన గాలులతో పాటు గాలి, వానకు కోతకు వచ్చిన పొలాలు నేలవాలాయి. ధాన్యం కూడా నేలరాలి నష్టం వాటిల్లింది. పెద్దవంగరలో పిడుగుపడి అనాపురం వెంకటయ్య అనే రైతుకు చెందిన సుమారు రూ. 60 వేల విలువైన పాడి గేదె మృతి చెందింది. మిగతా మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. ఉరుములు కారణంగా విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

దళితులకు బ్యాంకు రుణాలందించాలి

టీడీపీ రాష్ట్ర నాయకుడు కొండపల్లి రాంచందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం జంగిలిగొండ గ్రామ దళిత రైతులకు క్రాప్‌లోన్లు అందించాలని టీడీపీ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కొండపల్లి రాంచందర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో శనివారం ఎంపీ బలరాంనాయక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ జంగిలిగొండ గ్రామంలో 2016లో దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ భూమి కొనుగోలు చేసి 11 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి మూడుఎకరాల భూమికి పాస్ పుస్తకాలు ఇచ్చారని చెప్పారు. వారికి గతంలో డీసీసీబీ నుంచి క్రాప్‌లోన్లు ఇచ్చారని, ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకంలో ఆ రుణాలు మాఫీ అయ్యాయని చెప్పారు. తిరిగి క్రాప్‌లోన్లు ఇవ్వాలని బ్యాంక్ అధికారులను సంప్రదించగా, అది ప్రభుత్వ భూమి అని రుణాలు ఇవ్వమని నిరాకరించారని తెలిపారు. స్పందించిన ఎంపీ బలరాంనాయక్ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వారికి బ్యాంకు రుణాలు అందించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రేమ్‌చంద్‌వ్యాస్, ముల్కలపల్లి చందు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటును విరమించుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యా పరిరక్షణ కమిటీ

భూపాలపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కార్పొరేట్ రంగాలకు ఊతమిచ్చే విధంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. భూపాలపల్లిలోని కొమురయ్య భవన్‌లో 'తెలంగాణ విద్యారంగం సమస్యలు- సవాళ్లు- కర్తవ్యాలు' అంశంపై భూపాలపల్లి విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా రాష్ట్ర కమిటీ కార్య నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందాలంటే కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుతో సామాన్య విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేయడమే అవుతుందన్నారు. జీవో 25ను ప్రభుత్వం సవరించాలని, ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు లింగారెడ్డి, తిరుపతి, సేవానాయక్, రమణారెడ్డి, జగపతిరావు, ప్రవీణ్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

అణగారిన వర్గాలను ఇబ్బందులు పెట్టొద్దు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ వెంకటయ్య

- ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి
- అట్రాసిటీ, భూ సమస్యలను పరిష్కరించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

ములుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహించొద్దని సూచించారు.

చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబునాయక్, రేణికుంట్ల ప్రవీణ్ ములుగులో శనివారం పర్యటించారు. కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ వారికి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ల్యాండ్, సర్వీస్, అట్రాసిటీ కేసులపై జిల్లా అధికారులతో శాఖల వారీగా చైర్మన్ పెంటయ్య సమీక్ష జరిపారు. దళితులు, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం మంజూరైన నిధులు, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే కమిషన్ అక్కడికి వెళ్లి అండగా నిలబడుతోందన్నారు.పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. 15 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను పూర్తి చేయాలని సూచించారు. పోలీసు స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. ప్రతినెలా చివరి వారంలో సివిల్ రైట్స్ డే, ప్రతి మూడు నెలలకోసారి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్, ఎస్పీ పనితీరును ప్రశంసించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, పదోన్నతుల్లో అవకతవకలు లేకుండా చూడాలన్నారు.

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన ఎస్సీ, ఎస్టీలు నివసించే ఆవాసాలలో అభివృద్ధి పనులు చేయాలన్నారు. ప్రశ్నించకుంటే బానిసలుగా మిగిలిపోతారనే అంబేద్కర్ పిలుపును ప్రతి దళిత గిరిజనుడూ పాటించాలని, హక్కులను సాధించుకునేందుకు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. హక్కుల సంఘాల నాయకులు గ్రీవెన్స్ డేలను సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేయాలన్నారు. బడుగులు సేచ్ఛాయుత వాతావరణంలో బతికేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కమిషన్ చైర్మన్‌కు వినతులు సమర్పించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లా ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు లక్ష్మణ్‌నాయక్, రవీందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, తహసీలార్లు, ఎంపీడీవోలు, మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీలో అవకాశం ఇవ్వాలి

ఎస్సీ, ఎస్టీ జిల్లా మానిటరింగ్ కమిటీలో ఎమ్మార్పీఎస్ ఉద్యమ నాయకులకు అవకాశం కల్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు వినతిపత్రం సమర్పించారు. 30 ఏళ్లుగా దండోరా ఉద్యమంలో కొనసాగుతున్న వారికి జిల్లా కమిటీలో గుర్తింపు లేకపోవడం ఆవేదనకు గురిచేసిందని వారు పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన వెంకటయ్య అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

సంక్షిప్త వార్తలు

ఐటీఐలో ప్రవేశాలకు 30 వరకు దరఖాస్తుల పొడిగింపు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 30 వరకు పొడగించినట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి శనివారం తెలిపారు. వివిధ గ్రేడుల్లో చేరేందుకు 10వ తరగతి ఉత్తీర్ణులై 1-8-2024 నాటికి 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు అర్హులన్నారు. గత కౌన్సెలింగులో సీట్లురాని అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరంలేదన్నారు. పూర్తి వివరాల కోసం ఝఱః//జ్ఱజ్ఞ్చజ్ఞాఱఱ.జౌఠి.జీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఎఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు కోరుకున్న ఐటీఐ కళాశాలల్లో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

విద్యార్థినులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

మహబూబాబాద్ జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

సీరోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి అన్నారు. సీరోలు మండలం మన్నెగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో మాట్లాడుతూ.. విద్యార్థినులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కౌమారదశలో వచ్చే మార్పుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని సన్మార్గంలో నడవాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విత్తనాల సుధాకర్, ఉపాధ్యాయులు ఇందిరరాణి, శ్రీధర్, ప్రశాంతి, విక్టోరియా, లక్ష్మీనర్సయ్య, విజయకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

ఇనుగుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో శనివారం నూతనంగా కేసముద్రం మార్కెట్ చైర్మన్‌గా నియామకమైన గంట సంజీవరెడ్డిని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఎంపీ శుభాకాంక్షలు తెలిపారు.



కేసముద్రం ఏఎంసీ చైర్మన్ సంజీవరెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

క్రైం న్యూస్

పిడుగుపాటుతో మహిళా మృతి

సొమ్మసిల్లిపడిపోయిన మరో మహిళ



మృతి చెందిన మౌనిక

కేసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి శివారు మేగ్యాతండాకు చెందిన లకావత్ మౌనిక (23) శనివారం మధ్యాహ్నం పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. తండావాసులు తెలిపిన ప్రకారం. తండాకు సమీపంలోని వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంఖానిపేట పరిధిలోని పత్తి తీసేందుకు మేగ్యతండా చెందిన పలువురు కూలీలు వెళ్లారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో కూలీలంతా సమీపంలోని చెట్టు వద్దకు పరిగెత్తారు. వీరిలో ముందుగా మౌనిక చెట్టు కిందకు వెళ్లడంతో అదే సమయంలో భారీశబ్దంతో చెట్టుపై పిడుగు పడింది. వెంటనే పిడుగు నుంచి వచ్చిన విద్యుదాఘాతానికి గురైన మౌనిక అక్కడికక్కడే కిందపడిపోయింది. ఆమెను వాహనంలో మహబూబాబాద్‌కు తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలపడంతో మౌనిక మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. మృతురాలికి భర్త మహేష్, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త, కుమారుడిని చూసి తండావాసులు కంటతడి పెట్టారు. ఇదిలా ఉండగా మౌనికతోపాటు మరో మహిళా కూలీ లకావత్ అనిత సొమ్మసిల్లిపడిపోయి తర్వాత తేరుకుంది. వీరి వెనుక ఐదారుగురు కూలీలు చెట్టు కిందకు వచ్చేందుకు ప్రయత్నించారు. వీరంతా కొద్దిక్షణాలు ముందుగా చెట్టుకిందకు వచ్చి ఉంటే భారీ ప్రాణనష్టం జరిగేదని తండావాసులు తెలిపారు. ఇదిలా ఉండగా నెక్కొండ, కేసముద్రం మండలాల సరిహద్దులో ఈ ఘటన చోటు చేసుకోవడంతో పోలీస్‌స్టేషన్ల పరిధి విషయంలో సందిగ్ధం నెలకొంది. దీంతో మృతదేహానికి మహబూబాబాద్‌లో పోస్టుమార్టం నిర్వహించామని, ఘటన జరిగిన ప్రాంతం నెక్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండడంతో కేసును నెక్కొండకు బదిలీ చేయనున్నట్లు కేసముద్రం ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు.

గాలి వానతో విద్యుత్ సరఫరాలో అంతరాయం

రఘునాథపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిలాషాపూర్, మేకలగట్టు, మండేలగూడెం సబ్ స్టేషన్‌పరిధిలో గాలి వాన బీభత్సానికి విద్యుత్ స్తంభాల డిస్కులు విరిగి కిందపడ్డాయి. దీంతో ఇన్సులేటర్లు ఫెయిలై పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు శనివారం రాత్రి అంతరాయం కలిగింది. విద్యుత్ సిబ్బంది నర్మెట 132 కేవీ సబ్-స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను తీసుకుని రాత్రి వేళలో సైతం పని చేసి మూడు సబ్-స్టేషన్ల ఫీడర్ల పరిధిలోని అన్నిగ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నెల రోజుల్లో ఎనిమిది మంది మృతి

- వారంతో మంగళవారమే మృత్యువాత
- పాడుబడిన ఇంట్లో క్షుద్రపూజల ఆనవాళ్లు
- స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నెల రోజుల వ్యవధిలోనే ఎనిమిది మంది మృతి చెందడం, అందులో ఎక్కువ మంది మంగళ వారమే చనిపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం స్థానికులు ధైర్యం చేసి పాడుబడిన ఇంటిలోకి వెళ్లి చూడగా అక్కడ క్షుద్ర పూజల ఆనవాళ్లు కనబడడంతో ఖంగుతిన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తిరుమలనాథ స్వామి కాలనీలో ఈ వింత ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..

రఘునాథపల్లి మండలం చర్లతండాకు చెందిన గుగులోత్ రమేష్ ఏళ్ల క్రితం తిరుమలనాథ స్వామి కాలనీలో ఇల్లు కట్టుకుని జీవిస్తున్నాడు. 15 ఏళ్ల క్రితం ఇంటిని విడిచిపెట్టి స్వగ్రామం వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంట్లో ఎవరూ ఉండకపోవడంతో పాడుబడింది. ఇదిలాఉండగా, కాలనీలో ఈ నెల రోజుల వ్యవధిలో వివిధ కారణాలతో ఎనిమిది మంది మృత్యువాతపడ్డారు. అందులో ముగ్గురు ఈ ఇంటి చుట్టు పక్కల చెందిన వారే కావడంతో గ్రామస్తులు జంకుతున్నారు. ఊళ్లో మరణాలకు ఈ ఇల్లే కారణమై ఉంటుందనే అనుమానంతో రెండు రోజులుగా కాలనీవాసులు ఏకమై ఇంటిని తెరిపించాలని నిర్ణయించారు.

ఇందులో భాగంగా 20మంది కాలనీ వాసులు శుక్రవారం సాయంత్రం పాడుబడ్డ ఇంట్లోకి వెళ్లిచూడగా క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించడంతో అవాక్కయ్యారు. భయాందోళన చెందిన వారు డయల్ 100కి ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చి వారికి నచ్చచెప్పి ఇంటి యజమానిని పిలిపిస్తామని చెప్పి వెళ్లారు. కాలనీవాసులు శనివారం ఉదయం సీఐ జి. వేణును కలిసి సమస్యను వివరించగా సీఐ ఇంటి యజమానికి ఫోన్ చేసి అతడిని పిలిపించి ఇంటిని బాగు చేసి కాలనీవాసులకు భయం లేకుండా చేయాలని సూచించారు. ఇంటి యజమాని రమేష్ అక్కడికి వచ్చినా ఇంట్లోకి వెళ్లడానికి సాహసించలేదు. స్థానికంగా ఉండే కూలీలను ఆయన పిలిపించి అందులో ఉన్న క్షుద్రపూజలకు సంబంధించిన ఆనవాళ్లను తొలగింపజేశాడు. అయినా యజమాని ఇంట్లోకి వెళ్లడానికి ససేమిరా అన్నాడు. తన వదిన ఇటీవల నీటిలో దూకి ఆత్మహత్య చేసుకుందని వాపోయాడు. చేసేదేమి లేక బుధవారం కాలనీవాసులు సామూహిక వనభోజనా లకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. 20 ఏళ్ల క్రితం ఇలాంటి ఘటన జరిగిన పుడు వెళ్లామని, ఇప్పుడు మళ్లీ వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు పేర్కొన్నారు.



క్షుద్ర పూజలు జరిగిన ఇంటిని చూపుతున్న కాలనీవాసులు

ఫీజు కట్టలేక స్కూల్లో నిలుచున్నా..

- రాజకీయాల్లో ఉన్నా కారు కూడా నాన్న కొనలేదు..
- మెడిసిన్ చదివేటప్పుడే నజీర్‌తో అప్పుడే ప్రేమలో పడ్డా..
- పేదలకు సేవ చేసేందుకే ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌గా చేరాను..
- ఎంపీగా గెలవడం కన్నా.. పేదలకు మేలు చేయడమే మిన్న..
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో 'ఆంధ్రజ్యోతి ఇన్నర్ వ్యూ'



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రాష్ట్ర రాజకీయాల్లో పేరుమోసిన బడా లీడర్.. మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా పని చేసిన నేత గారాలపట్టి ఆమె. అయినా.. స్కూల్ ఫీజు కట్టలేదంటూ ఉపాధ్యాయులు నిలబెట్టిన సందర్భాలు ఉన్నాయి. మెడిసిన్ చదువు కోసం ఆర్టీసీ బస్సు, ఆటోల్లో వెళ్లిన రోజులూ ఉన్నాయి. డాక్టర్‌గా కార్పొరేట్ అస్పత్రిలో ప్రాక్టీస్ చేసి నాలుగు రాళ్లు వెనుకేసుకునే అవకాశం ఉన్నా.. సర్కారు దవాఖానలో వైద్యురాలిగా చేరింది. కొడుకులు లేరనే లోటు తండ్రికి లేకుండా చేసి రాజకీయాల్లో వారసురాలిగా అరగ్రేటం తోనే ఓరుగల్లులో విజయం సాధించి మరో రాణిరుద్రమగా గుర్తింపు పొందారు. ఆమె.. కడియం కావ్య. ఓరుగల్లు రాజకీయాల్లో కీలకంగా ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె, వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య 'ఇన్నర్ వ్యూ' ఆమె మాటల్లోనే..

ఫీజు కట్టలేదని నిలుచోపెట్టారు..

నా బాల్యం అంతకూడా హనుమకొండ టీచర్స్ కాలనీలోనే గడిచింది. ఏడో తరగతి వరకు కాకతీయ స్కూల్‌లో చదువుకున్నా. మా నాన్న కడియం శ్రీహరి రాజకీయాల్లోకి వచ్చిన రోజుల్లో నాకు, మా చెల్లికి స్కూల్ ఫీజు సకాలంలో చెల్లించేవారు కాదు. మా నోట్‌బుక్‌లో ఫీజు చెల్లించాలని ఉపాధ్యాయులు రాసి పంపించేవారు. ఒక్కోసారి అందరు పిల్ల లతో మమ్మల్ని కూడా నిల్చోపెట్టేవారు. నాన్న వద్ద డబ్బులు లేక పోవడమే ఈ సమస్య అని సర్దుకునేవాళ్లం. మా నాన్న రాజకీయాల్లో బిజీగా ఉండటంతో చాలాసార్లు మాతో గడిపే వారు కాదు. ఒక్కోసారి ఉదయం 6గంటలకు బయటకు వెళితే.. రాత్రి పొద్దుపోయాక వచ్చేవారు. అయితే ఉన్నత చదువుల విషయంలో ఆయన దృష్టిపెట్టారు. కొంత సమయం కేటాయించేవారు. నాన్న లెక్చరర్ కావటంతో వివిధ సబ్జెక్టుల్లో మా ప్రతిభను అప్పుడప్పుడు పరీక్షించేవారు. చిన్నప్పటి నుంచి నాకు డాక్టర్‌ను కావాలనే కోరిక ఉండేది. దానికి నాన్న ప్రోత్సాహం తోడవ్వటంతో డాక్టర్ అయ్యాను.

ఆర్టీసీ బస్సుల్లో కాలేజీకి వెళ్లాను..

సుదీర్ఘకాలం నాన్న ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పనిచేశారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా కొనసాగటంతో ప్రభుత్వ పరంగా వాహన సదుపాయం ఉండేది. దీంతో ఆయనకు ఎప్పుడూ కూడా సొంతంగా కారు కొనాలనే ఆలోచన రాలేదు. అయితే 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో నాన్నకు టికెట్ రాలేదు. ఏ పదవి లేకుండా పోయింది. స్నేహితుల కార్లు కూడా అందుబాటులో లేవు. దీంతో నాకు కాలేజీకి వెళ్లేందుకు కారు లేకుండా పోయింది. మెడిసిన్ ఫైనల్ ఇయర్ కావటంతో పంజాగుట్ట నుంచి సంతోష్ నగర్‌లోని డక్కన్ మెడికల్ కాలేజీకి ఆర్టీసీ బస్సులో చాలారోజులు ప్రయాణం చేసి కాలేజీకి వెళ్లాను. ఒక్కోసారి ఆటోలో కూడా ప్రయాణించి కాలేజీకి వెళ్లి చదువుకున్నా.

> నాన్న రాజకీయాల్లో అనుసరించిన నీతి, సేవా, ధర్మాన్నే నేనూ అనుసరిస్తున్నా. అప్పుడు ప్రభుత్వ వైద్యురాలిగా, ఇప్పుడు
>
> **ఎంపీగా వచ్చే జీతం కోసం చూస్తున్నా..**
>
> ఎంపీగా నాకు వచ్చే జీతం కోసమే ఎదురుచూస్తున్నాను. సుదీర్ఘకాలం ఎన్నో పదవుల్లో ఉన్నప్పటికీ నీతివంతమైన రాజకీయం చేయాలనేదే నాన్న నేర్పిన రాజకీయ విద్య. అదే అనుసరిస్తున్నాను.

ప్రేమ గురించి నాన్నకు నేనే చెప్పా..

నేను మెడికల్ చదువుతున్నప్పుడే నజీర్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరం కలిసి మెడిసిన్ పూర్తి చేశాం. మొదట ఫ్రెండ్స్‌గానే ఉన్నప్పటికీ నజీర్ వ్యక్తిత్వం బాగా నచ్చింది. దీంతో ఒకరినొకరం పూర్తిగా అర్థం చేసుకున్నాం. జీవితంలో నన్ను బాగా చూసుకోగలడని నిశ్చయించుకున్న తరువాత పెళ్లి చేసుకోవాలని నిర్ణయానికి వచ్చాను. ఒక రోజు నా ప్రేమ గురించి నాన్నకు చెప్పాను. నజీర్‌ను ఇంటికి ఆహ్వానించి నాన్నకు పరిచయం చేశాను. నాన్నలో ఏదో ఆందోళన కనిపించింది. కులం, మతం కాని వ్యక్తితో పెళ్లి అంటే ఎట్లా అని ఆలోచించారు. నాన్నకు దగ్గరగా ఉండే ఇద్దరు స్నేహితులతో మాకు కౌన్సెలింగ్ కూడా ఇప్పించారు. చివరికి నజీర్‌తో మాట్లాడిన తరువాత నాన్నకు నమ్మకం కలిగింది. మా పెళ్లికి ఒప్పుకున్నారు. అంబేద్కర్ జయంతి రోజు ఏప్రిల్ 14న ఎంగేజ్మెంట్. ఆగస్టు 26న మా వివాహం జరిగింది. నాన్న నజీర్‌ను ఓ అల్లుడిగా కాకుండా ఓ కొడుకులాగే ప్రేమగా చూస్తారు.

సేవ కోసమే ప్రభుత్వ ఆస్పత్రిలో డ్యూటీ చేశా..

ఎంబీబీఎస్ పూర్తి అయిన తరువాత ఓ ప్రవేటు అస్పత్రిలో ట్రైనింగ్ చేశాను. ప్రైవేటు అస్పత్రిలో పనిచేస్తే డబ్బులు సంపాదించొచ్చు. కానీ, పేదలకు సేవ చేయాలనే ప్రభుత్వ అస్పత్రిలో చేరాలని అనుకున్నా. విషయం నాన్నకు చెబితే నీకు నచ్చినట్లు చెయ్.. అని సలహా ఇచ్చారు. దీంతో వర్ధన్నపేట పీహెచ్‌సీలో వైద్యురాలిగా చేరాను. సుమారు ఐదేళ్లు సేవలందించాను. కొన్ని వేల మందికి వైద్యసేవలు అందించాను. ఎంతో మందిని ప్రత్యక్షంగా కలుసుకుని వారు పడుతున్న కష్టాలను గుర్తించాను. మంచి వైద్యం కోసం ఎంజీఎంతోపాటు ఇతర ప్రభుత్వ అస్పత్రులకు పంపించాను.

చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి

చిన్నతనం నుంచి నాన్నలాగా రాజకీయాల్లోకి రావాలనే కోరిక ఉండేది. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల వరకు దగ్గరుండి చూశాను. ఓసారి జడ్పీ చైర్మన్ ఎన్నిక కోసం సభ్యులు తక్కువ పడితే క్యాంపు పెట్టారు. అక్కడున్నవారితో మాట్లాడితే రాజకీయాలపై కొంత అవగాహన కలిగింది. అప్పటి నుంచే పొలిటికల్ ఎంట్రీపై ఆసక్తి ఉండేది. ఈలోగా డాక్టర్‌గా ప్రభుత్వ అస్పత్రిలో కొంతమందికు సర్వీసు చేసే అవకాశం కలిగింది. దీంతో రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనతో గత ఏడాది నవంబరులో వైద్యవృత్తికి రాజీనామా చేశాను.

బీఆర్‌ఎస్ నుంచి ఎంపీ టికెట్ ఇస్తామని అప్పటి నుంచే చెబుతూవచ్చారు. అనూహ్యంగా జరిగిన కొన్ని రాజకీయ పరిణామాల్లో పార్టీ మారాల్సి వచ్చింది. కాంగ్రెస్ నుంచి పోటీ చేసి వరంగల్ ఎంపీగా విజయం సాధించాను. పోటి చేసిన తొలి ఎన్నికలోనే విజయం సాధించటం చాలా ఆనందంగా ఉంది. పార్లమెంట్‌లో తొలిసారి అడుగు పెట్టడం మరుపురాని ఘట్టమే. పార్లమెంట్‌కు రాష్ట్రపతి వస్తుంటే ప్రధానమంత్రితో పాటు కేంద్ర మంత్రులు, ఎంపీలు స్వాగతం పలకడం వంటి వాటిని తొలిసారి చూసిన క్షణం మరువలేనివి.

> **సంక్షేమం, అభివృద్ధిపైనే ఫోకస్**
>
> ఎంపీగా గెలిచాననే సంతోషం కంటే.. పేదలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు ఏం చేయాలనే తపనే ఎక్కువగా ఉంది. కేంద్ర ప్రభుత్వం నుంచి సాధ్యమైనన్ని ఎక్కువ నిధులు తీసుకరావటంతోపాటు విద్య, వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ప్రణాళిక రుపొందిస్తున్నాను. ఐదేళ్ల కాలంలో వరంగల్‌ను సాధ్యమైనంత అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నాను. మామూనురు ఎయిర్‌పోర్టు, స్మార్ట్ సిటీ, యూనివర్సిటీ అభివృద్ధి, భూపాలపల్లితో పాటు ఇతర ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ, ప్రభుత్వ అస్పత్రుల్లో పేదలకు మెరుగైన సౌకర్యాలు, తదితర వాటిపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాను. ప్రజలు నమ్మకంతో గెలిపించారు. అంతే నమ్మకంతో వారికి సేవల చేయాలనే దృఢసంకల్పంతో ఉన్నాను.

రాష్ట్ర విద్య కమిషన్‌లో కేయూకు చోటు

- సలహాదారులుగా ఇద్దరు కేయూ ప్రొఫెసర్ల నియామకం
- కె.వెంకటనారాయణ, మురళీమనోహర్‌కు అవకాశం



వెంకటనారాయణ, మురళీమనోహర్

కేయూ క్యాంపస్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర విద్య కమిషన్ అడ్వయిజరీ కమిటీలో వరంగల్ కాకతీయ యూనివర్సిటీ నుంచి ఇద్దరు ప్రొఫెసర్లకు అవకాశం కల్పించింది. కేయూ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్, ప్రముఖ సామాజిక వేత్త ప్రొఫెసర్ కూరపాటి వెంకట్‌నారాయణ, దూరవిద్య కేంద్రం మాజీ డైరెక్టర్, ప్రముఖ విద్యావేత్త కె.మురళీమనోహర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. వర్సిటీ నుంచి తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సలహాదారులుగా ఇద్దరిని నియమించడంపై వర్సిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. వీరితో పాటు సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ జి.హరగోపాల్, కరీంనగర్ శాతవాహన వర్సిటీ ప్రొఫెసర్ సూరెపల్ల సుజాత, ఎంవీఎఫ్ నేషనల్ కన్వీనర్ పి.వెంకట్‌రెడ్డి, యూనిసెఫ్ ఎడ్యుకేషన్ స్పెషలిస్టు ఎం.శేషగిరి తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ కమిషన్ అడ్వయిజరీ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. ఎడ్యుకేషన్ కమిషన్‌కు చైర్మన్‌గా రిటైర్డు ఐఏఎస్ అధికారి అకునూరి మురళిని గతంలోనే రాష్ట్రప్రభుత్వం నియమించింది.

ఆర్కెస్ట్రా ఆరో ప్రాణం

- సంగీతంలో పిల్లల వైద్యుడి ప్రావీణ్యం
- విద్యార్థి దశ నుంచే గాయకుడిగా రాణింపు



డాక్టర్ శివకుమార్

వరంగల్ మెడికల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయనో సీనియర్ పిల్లల వైద్యుడు. వృత్తిలో భాగంగా చిన్నారులకు వైద్యం అందిస్తాడు. కానీ సంగీతం అంటే మహా ప్రాణం. ఆర్కెస్ట్రా అంటే ఆరో ప్రాణం.. వైద్య వృత్తిలో ఎంత బిజీగా ఉన్నా ఆర్కెస్ట్రాపై మమకారం చంపుకోలేదు. విద్యాభ్యాసం నుంచే కలలు, సంగీతంపై మమకారం పెంచుకొని ఇప్పటికీ ఆచరిస్తున్నాడు.

ఎంజీఎం ఆస్పత్రి, సీకేఎం ఆస్పత్రిలో సుదీర్ఘకాలం పాటు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందాక రామన్నపేటలోని ఓ హాస్పిటల్‌లో పిల్లల వైద్యుడిగా కొనసాగుతున్న డాక్టర్ శివకుమార్ బాల్యం నుంచే కళా రంగంలో రాణించాలని పట్టుదలతో ప్రయత్నించారు. 1973లో ఎనిమిదో తరగతి చదువుతున్నప్పుడు వరంగల్ ఏబీవీ హైస్కూల్‌లో వారసత్వం, నామకరణం అనే నాటకాలలో ప్రతిభ కనబరిచారు. ఇలా ఆరంభమైన కళాపోషణ.. ఎంబీబీఎస్ విద్యాభ్యాసం వరకు కొనసాగింది. కేఎంసీలో కూడా ఏ కార్యక్రమం జరగాలన్నా ప్రార్థన గీతం ముగింపు డాక్టర్ శివకుమార్ చేయాల్సిందే. సంగీతంపై మమకారంతో డిప్లొమా పూర్తి చేశారు. ఇప్పటికీ కాకతీయ వైద్య కళాశాలలో ఏ ఉత్సవం జరగాలన్నా డాక్టర్ శివకుమార్ ఆర్కెస్ట్రాతో అలరించాల్సిందే. తన తండ్రి ఆయుర్వేద వైద్యుడైన కోటయ్య గారి దగ్గర నుంచి వారసత్వంగా కలలపై మమకారం పెంచుకున్నారు. ఇలా ఇప్పటి నుంచి మొదలై ఆరు పదుల వయస్సులో కూడా ఆర్కెస్ట్రా అంటే ప్రాణంగా జీవిస్తున్నారు. 2001లో వరంగల్ స్వర్ణ ప్యాలెస్‌లో నిర్వహించిన పాడుతా తీయగా కార్యక్రమంలో ఉషా, సారంగపాణితో పాటలు పాడి అందరినీ మెప్పించారు. పితృ అమావాస్య రోజున పితృలకు ఆశీర్వచనం కోసం వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్నారు. అందుకే ఆయనను డాక్టర్ అయ్యగారూ.. అని కూడా రామన్నపేట వాసులు సంబోధిస్తారు. ఈ మధ్య గిరిజా కళ్యాణం సీనియల్‌లో కూడా ఓ పాత్రకు ఎంపికయ్యారు. వృత్తిలో కొనసాగుతూనే.. తనకు ఇష్టమైన కళారంగాన్ని మాత్రం ప్రాణంగా భావిస్తూ కళాకారులుగా అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆరోగ్య సమస్యలపై అశ్రద్ధ వద్దు

- వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా
- పోలీసు సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం

హనుమకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బందికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యల పట్ల అశ్రద్ధ వహించొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు చెందిన పోలీసు సిబ్బంది, హోంగార్డు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులు, విశ్రాంత పోలీసు ఉద్యోగులు, పోలీసు అమరవీరుల కుటుంబసభ్యుల కోసం ప్రత్యేక ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. భీమారంలోని శుభం కల్యాణ వేదికలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి సీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్స్, శరత్ మాక్స్ విజన్ ఐ హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపులో జనరల్ ఫిజీషియన్, కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, పల్మనాలజీ, మెడికల్ గ్యాస్ట్రో, కంటి విభాగాలకు చెందిన వైద్యనిపుణులు పోలీసు సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన సిబ్బందికి డాక్టర్ల సూచనల మేరకు షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, సీఎఫ్టీఈ పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సీపీ అంబర్ కిషోర్ ఝా సైతం కంటి పరీక్షలను చేయించుకున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకున్న పోలీసు సిబ్బంది కేవలం పరీక్షలతో సరిపెట్టుకోకుండా డాక్టర్లు సూచించిన సలహాలను పాటిస్తూ సమయానికి మందులను తీసుకుంటూ సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలన్నారు. ముఖ్యంగా విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ఆరోగ్యం కోసం నిరంతరం వ్యాయామం, యోగా చేయడంతో పాటు దైనందిన ఆహారపు అలవాట్లలో మార్పు అవసరమని అన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉంటే శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించగలమని అన్నారు. ఈ వైద్య శిబిరంలో సహకరించిన మెడికవర్, మాక్సీ విజన్ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బందికి సీపీ అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, ఆర్‌ఐలు, ఇన్స్‌పెక్టర్లు, ఆర్‌ఎస్‌ఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీసు సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.



శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

పోలీసు అమరవీరుల త్యాగాలను మరువొద్దు

- సీపీ అంబర్ కిశోర్ ఝా..
- పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ

హనుమకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : శాంతి, భద్రతల పరిరరక్షణకు ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులను ప్రజలు మరువొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా తెలిపారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే) పురస్కరించుకొని శనివారం పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. సీపీతోపాటు పోలీసు అమర వీరుల కుటుంబ సభ్యులు ఇందులో పాల్గొన్నారు. అశోకా జంక్షన్ నుంచి వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. నక్సలైట్ల చేతుల్లో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలు వృథాపోవని, వారి త్యాగాల ద్వారా నేడు ప్రశాంతవాతావరణం నెలకొందని అన్నారు. అలాగే అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీలో డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్ కుమార్, రవితో పాటు ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీసు సిబ్బంది, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు, జాగృతి కళాబృందం కళాకారులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తున్న పోలీసు అమరవీరుల కుటుంబాల మహిళలు



కేయూ వీసీగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

- అభినందనలు తెలిపిన వర్సిటీ వర్గాలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ నూతన ఉప కులపతిగా ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. కేయూ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ పాలక మండలి సభ్యులు నూతన వీసీ ప్రతాప్‌రెడ్డిని సాదరంగా ఆహ్వానించారు. వర్సిటీ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ పుల్లూరి సుధాకర్, డాక్టర్ పి.నవీన్, డాక్టర్ సుకుమారి, డాక్టర్ చిర్ర రాజుగౌడ్, డాక్టర్ బొద్దిరెడ్డి రమారెడ్డి, డాక్టర్ కరుకాల అనితారెడ్డి పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా నూతన ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ... అందరి సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. వర్సిటీలో సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

అభినందనల వెల్లువ

కేయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్‌రెడ్డికి వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నేతలు వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛం, శాలువాలు అందచేసి ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అకూట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, ప్రొఫెసర్ మొలుగూరి శ్రీనివాస్, డాక్టర్ రమేశ్‌కుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఎమ్డీ మస్తాఫా, ఎఫ్‌వో తోట రాజయ్య, టీచింగ్, నాన్ టీచింగ్ ఏఆర్ ప్రణయ్‌కుమార్, పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ నరసింహారావు, కేయూ ఎన్టీవోస్ సంఘం జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, సతీశ్‌బాబు, తోట ప్రభాకర్, ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ,డాక్టర్ పుల్లా శ్రీనివాస్, బొక్క మొగిళి, నమిండ్ల కిరణ్‌కుమార్, మంద నరేశ్, మాలవత్ తిరుపతి, సోరపాక అనిల్, సంగి శివాజీల తోపాటు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు వీసీకి అభినందనలు తెలిపారు.

ఫ్లెక్సీల మోత

కాకతీయ యూనివర్సిటీ నూతన వీసీగా ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని గతంలో ఎన్నడూలేని విధంగా పరిపాలన భవనం ఎదుట కొందరు భారీగా స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అయితే గతంలో వర్సిటీలో ఫ్లెక్సీలు కట్టి స్వాగతాలు తెలిసిన సందర్భాలు లేకపోవడంతో నూతనంగా నయాట్రెండ్ ఫ్లెక్సీలతో స్వాగతం పలకడం వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

కిట్స్‌లో ముగిసిన 'సంశోధిని-24'

హసన్‌పర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రగట్టుగుట్ట కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సిల్వర్ జూబ్లీ సెమినార్ హాలులో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక సింపోజియం సంశోధిని-24 కిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి అధ్యక్షతన శనివారం ఘనంగా ముగిసింది. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, కిట్స్ స్టూడెంట్ విద్యార్థి చాప్టర్, కిట్స్ టెక్నికల్ క్లబ్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌తో పాటు 10 విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ప్రాజెక్టు ఎక్స్‌పో, ఇన్నోవిజన్, ట్రెజర్ హంట్, 70పైచిలుకు సాంకేతిక కార్యక్రమాలతో పాటు విద్యార్థులను పరిశ్రమకు సిద్ధంగా ఉన్న ఇంజనీర్లుగా తయారు చేయడానికి, సీటీసీ ఉపాధిని సాధించడానికి ఆవిష్కరణ, ఇంక్యుబేషన్, రీసెర్చ్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. ఫెస్ట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.శ్రీలత, ప్రోగ్రాం కోకన్వీనర్ ప్రొఫెసర్ ఎం.నర్సింహారావు, ఐఎస్‌టీఈ కిట్స్ చాప్టర్ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ మధుకర్‌రెడ్డి, కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎస్.సునీల్ ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బి.విజయ్‌కు మార్, అసోసియేట్ ప్రొఫెసర్, పీఆర్‌వో డాక్టర్ డి.ప్రభాకరాచారి పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు

ఓరుగల్లుకు స్మార్ట్ 'స్వాగతం'



వరంగల్-హైదరాబాద్ ప్రధాన రహదారి రాంపూర్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు



వరంగల్ - ఖమ్మం ప్రధాన రహదారి బొల్లికుంట వద్ద ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు

ఓరుగల్లు అంటేనే కళలు, చారిత్రక కట్టడాలకు నిలయం. నిత్యం నలుదిక్కుల నుంచి వేలాది మంది వివిధ పనులు, ఉద్యోగ నిర్వహణకు వచ్చిపోతుంటారు. చారిత్రక ఓరుగల్లులోకి వచ్చేవారిని ఆహ్వానించేందుకు నలుదిక్కులా భారీ స్వాగత తోరణాలు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ సిటీ నిధులతో ఏర్పాటు చేసిన ఈ తోరణాల నిర్మాణం పూర్తయితే నగరానికి ప్రత్యేక ఆకర్షణ రానుంది.

– ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

పరుచుకున్న మంచు తెరల పరదా



వరంగల్ - నర్సంపేట ప్రధాన రహదారిపై కమ్ముకున్న పొగమంచు



తెలతెలవారుతుండగా మంచుతెరలు కమ్ముకుంటున్నాయి. శీతాకాలం ప్రారంభంలోనే రహదారులను మంచు ఆవహిస్తోంది. మంచు బిందువుల జల్లుల్లో వ్యవసాయ పనులకు, ఇతర పనులకు వెళ్లేవారు తడిసి ముద్దవుతున్నారు. వరంగల్ - నర్సంపేట రహదారిని శనివారం మంచు దుప్పటి కప్పేసింది. వివిధ పనులకు వెళ్లే వాహనదారులు, పాదచారులు మంచులోనే ప్రయాణించారు.

– ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

'ప్రతీ ఒక్కరు ఓటరు నమోదు చేయించాలి'


నర్సిరెడ్డి గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న టీఎస్-యూటీఎఫ్ నేతలు

గూడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్, నల్లగొండ, ఖమ్మం నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగువెల్లి నర్సిరెడ్డి తిరిగి గెలిపించాలని టీఎస్-యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ పిలుపునిచ్చారు. మచ్చర్ల, పొనుగోడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, బ్రాహ్మణపల్లి కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలల్లో నర్సిరెడ్డి గెలిపించాలని కోరుతూ టీఎస్ -యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 6 వరకు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ ఉంటుందని అదేనెల 23న జాబితాను ప్రకటించడం జరుగుతుందని చెప్పారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు కొనసాగుతుందన్నారు. తుదిజాబితాను 30న ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. టీఎస్-యూటీఎఫ్ బాధ్యులు బాధ్యతగా ఓటు నమోదు చేయిం చాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు ధనసరి రమేస్, జిల్లా కార్యదర్శి తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి రవీందర్, దేవేందర్ పాల్గొన్నారు.

టీజీఏటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

గూడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ (టీజీఏటీఎఫ్) గూడూరు మండల అధ్యక్షుడిగా తురస వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గూడూరులో శనివారం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, గౌరవ సలహాదారుడు కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన సంఘ సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటేశ్వర్లు గూడూరు మండలం సీతానాగారం ఆశ్రమ పాఠశాలలో పీడీగా పని చేస్తుండగా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గుమ్మడి వెంకటేశ్వర్లు గూడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసం నాగేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు సిద్దబోయిన భిక్షం, కల్తి భాస్కర్‌రావు, సుంచ రవీందర్, రామకృష్ణ, పూనెం లక్ష్మీనారాయణ, కృష్ణ, భూమయ్య, రవి, కిరణ్ పాల్గొన్నారు.

వనమహోత్సవం నిర్వహణలో నిర్లక్ష్యం

- తొర్రూరు మండలంలో పంపిణీ చేసిన మొక్కలు 1.66 లక్షలు
- మిగిలిన మొక్కలు 1.78 లక్షలు


వెల్లికట్టె గ్రామ నర్సరీలో ఎండిపోయిన మొక్కలు, పెరిగిన గడ్డి

తొర్రూరురూరల్, అక్టోబరు19 : వన మహోత్సవంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఆహ్లాద కరమైన వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేసి, వివిధ రకాల మొక్కలను పెంచి, నాటుతున్నారు. నాటిన అనంతరం నిర్లక్ష్యంగా వదిలివేయడంతో కొన్ని ఎదుగుతుండగా, మరికొన్ని చనిపోతున్నాయి.

తొర్రూరు మండలంలోని 29 గ్రామాల్లో మొక్కలను నర్సరీల్లో పెంచి, ఆయా ఖాళీ ప్రదేశాల్లో నాటి, వాటిని రక్షించాలి. ఆయా నర్సరీల్లో జామ, నేరడు, ఉసిరి, దానిమ్మ, గన్నేరు, గులాబీ, మల్లె తదితర మొక్కలను పెంచడానికి ఈజీఎస్ నిధుల నుంచి సుమారు రూ.లక్షా 50 వేలతో పాటు జీపీ నిధుల నుంచి కూడా అవసరమైన మేరకు ఉపయోగించాలని ఉన్నతాధికారులు సూచించారు. దీంతో గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అనుకూలంగా 20 గుంటలు, ఆ పైగాఉన్న భూమిలో నర్సరీలను ఏర్పాటు చేసి, రక్షణగా ఫెన్సింగ్, గేటు పెట్టి బోర్డును ఏర్పాటు చేశారు. 2023-2024 సంవత్సరానికి గాను ఆయా గ్రామాల్లో నర్సరీల్లో పండ్లు, పూలమొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలను ప్రతీ నర్సరీలో 11 వేల మొక్కల చొప్పున 3, 45,100 మొక్కలను పెంచారు. అయితే అందులో నుంచి 1,66,925 మొక్కలను వివిధ శాఖల ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటించగా, 29 నర్సరీల్లో 1,78,175 మొక్కలు అందుబాటులో ఉండాలి. అందు బాటులో ఉండాల్సిన మొక్కల సంరక్షణ పట్ల సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కొన్ని ఎండిపోయాయిజ

నిర్వహణలో అలసత్వం..

ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఫత్తేపురంలో అట్టహాసంగా మొక్కనాటి ప్రారంభించారు. నాటిన మొక్కలను ప్రతీ ఒక్కరు సంరక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల ఆదేశాలను పట్టించుకోకపోవడంతో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. తొర్రూరు మండలంలోని నర్సరీల్లో పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలు 3, 45,100 మొక్కలను పెంచారు. గ్రామాల్లో ప్రజలకు 98,825 మొక్కలు, మునిసిపాలిటీ, వివిధ శాఖల ఆధ్వర్యంలో 27,950మొక్కలు, చనిపోయిన వాటికి బదులు 5,350 మొక్కలు నాటారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో 34,800 మొక్కలు వెరసి 1,66,925 నాటగా.. నర్సరీల్లో సురక్షితంగా 1,78, 175 మొక్కలు ఉన్నాయి. క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యంతో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో మొక్కలు ఎండిపోయి, పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి.

వెల్లికట్టెలో 11,900 మొక్కలు నర్సరీలో పెంచగా 9,500 మొక్కలు పంపిణీ చేయగా 2,400 మొక్కలు ఉండాల్సి ఉండగా నిర్వహణ లోపంతో కొన్ని మొక్కలు ఎండిపోయి, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. పెద్దమంగ్యా తండాల్లో 11, 900 మొక్కలకు 4,750 మొక్కలు పంపిణీ చేయగా 7,150 మొక్కలు ఎండిపోయి ఉన్నాయి. ఖానాపురంలో 4,100 మొక్కలు నాటగా, 7,800 మొక్కలు ఉండాల్సి ఉండగా కొన్ని ఏపుగా పెరిగి చెట్లను తలపి స్తుంటే కొన్ని ఎండిపోయి ఉన్నాయి. టీక్యాతండాలో 1,000 మొక్కలు మాత్ర మే నాటగా, మిగిలిన 10,900 మొక్కలు నర్సరీల్లో ఉన్నట్లు రికార్డులో ఉండగా.. నర్సరీలో పాలకూర మొక్కలు మొలకెత్తుతున్నాయి. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నర్సరీ మొక్కలు పాడవుతుండంతో ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ మొక్కను సంరక్షిచాలి
నర్సింగరావు, తొర్రూరు ఎంపీడీవో



నర్సరీల్లో పెంచిన ప్రతీ మొక్కను సంరక్షిం చాలి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా నర్సరీలోని కొన్ని మొక్కలను ప్రజలకు పంపిణీ చేయగా, మరికొన్ని మొక్కలను ఖాళీ ప్రదేశాల్లో నాటించాం. నర్సరీల్లో మిగిలిన, నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి. లేనియెడల చర్యలు తీసుకుంటాం.

'తల్లిదండ్రుల భాగస్వామ్యంతో స్కూళ్ల అభివృద్ధి'


పేరెంట్స్, టీచర్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ ఆజాద్ చంద్రశేఖర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ఆజాద్‌చంద్రశేఖర్ అన్నారు. కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజూ విద్యార్థులను పాఠశాల పంపించి వారి విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. విద్యార్థులు ఇంటికి వచ్చిన తర్వాత హోంవర్కు చేస్తున్నారా! లేదా? అని గమనించాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాలల్లో నిర్వహించే సమావేశాలకు హాజరై విద్యార్థుల ప్రగతిని తెలుసుకోవాలన్నారు. ఈసమావేశంలో అమ్మ ఆదర్శపాఠశాల అధ్యక్షులు భూలక్ష్మీ, అలువేలు, హెచ్‌ఎంలు విష్ణువర్దన్, లక్ష్మీ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కాడెద్దులు మృతి

బయ్యారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పిడుగు పాటుకు రెండు కాడెద్దులు మృతి చెందిన ఘటన వినోభానగర్‌లో శనివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం. వినోభానగర్‌కు చెందిన కోల వెంకన్న అనే రైతు తనకు చెందిన రెండు కాడెద్దులను చేను వద్ద కట్టేసాడు. ఈ క్రమంలోనే సాయంత్రం సమయంలో కురిసిన అకాల వర్షానికి పిడుగు పడటంతో కాడెద్దులు అక్కడిక్కడే మృతి చెందాయి. కాడెద్దుల విలువ సుమారు రూ. 1.50 లక్షలు ఉంటుందని అంచనా.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం : డీఈ


విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన కలిపిస్తున్న డీఈ మధుసూదన్

తొర్రూరు రూరల్, అక్టోబరు 19 : రైతులకు ఏమైనా విద్యుత్ సమస్యలు ఎదురైతే తక్షణమే పరిష్కారిస్తామని తొర్రూరు డీఈ జి.మధుసూదన్ అన్నారు. శనివారం ఖానాపురం సబ్ స్టేషన్ పరిధిలో ఎస్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలతో విద్యుత్‌శాఖపొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈమాట్లాడుతూ విద్యుత్ మిడిల్ పోల్స్ సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని మిడిల్‌పోల్ సమస్యను త్వరలోనే పరిష్కరి స్తామన్నారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏదైనా సమస్య తలెత్తితే తక్షణమే అధికారులకు అందించాలని, మోటార్ ఆన్‌ఆఫ్ సమయంతో ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. అనంతరం గుడిబండ తండాల్లో పర్యటించి విద్యుత్ కనెక్షన్‌లేని వినియోగదారులు రూ.938 చెల్లించి తమ సర్వీసులను క్రమబద్దీకరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ చలపతిరావు, ఏఈ సుధాకర్, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

మార్గదర్శి బీ.ఎడ్ కళాశాల ప్రభంజనం

- డీఎస్సీ-2024లో 59 మంది పూర్వవిద్యార్థులకు కొలువులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డీఎస్సీ- 2024 వెలువడిన ఫలితాల్లో 59 మంది ఉపాధ్యాయులుగా నియామకమయ్యారని కళాశాల కరస్పాండెంట్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, డైరెక్టర్ తక్కెళ్లపల్లి సంధ్యారాణి శనివారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మార్గదర్శి బీ.ఎడ్, డీ.ఎడ్ కళాశాలల్లో పూర్తి చేసిన పూర్వవిద్యార్థులు ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్టీటీ)లే, స్కూల్ అసిస్టెంట్‌లు 5 గురు వెరసీ 54 మంది విధుల్లో చేరారని తెలిపారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో గుగులోతు మౌనిక (బయోసైన్స్), బత్తుల కృష్ణవేణి (సాంఘికశాస్త్రం), జంగం రేణుక (మ్యాథ్స్), ఉడుత వెంకన్న (తెలుగు), చింతల సబిత (తెలుగు)లు ఎంపికయ్యారని తెలిపారు. పూర్వవిద్యార్థులు డీఎస్సీ-2024లో 59 మంది ఉపాధ్యాయులుగా నియామకమవడం పట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ్మగాని అరుణ్‌కుమార్, అధ్యాపకులు బాలాజీ, చంద్రశేఖర్, భాస్కర్‌లు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీసీతారాములకు ప్రత్యేక పూజలు


కొత్తగూడలో సీతారాములను ప్రతిష్ఠిస్తున్న పండితులు

కొత్తగూడ, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడలో నూతనంగా వెలసిన శ్రీసీతారాములకు శనివారం భక్తులు వైభవంగ పత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గ్రామపెద్ద ఇంటిలో శ్రీసీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు మ్రోగిస్తు శివసత్తులు పూనకాలు ఊగుతుండగా భక్తులు జైశ్రీరామ్ నినాదాలు చేస్తు శ్రీసీతారాముల విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తు సీతారాములు వెలసిన ప్రదేశం వద్దకు తీసుకువచ్చారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి శ్రీసీతారాములను ప్రతిష్ఠించారు. భారీగా తరలి వచ్చిన భక్తులు సీతారాములకు పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అనారోగ్యంతో నీటిపారుదల శాఖ లస్కర్ మృతి

తొర్రూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) :మండలం నీటిపారుదల శాఖ (ఎస్సారెస్పీ) కార్యాలయంలో లస్కర్‌గా విధులు నిర్వహిస్తున్న గార రవి (38) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు, బంధువుల కథనం ప్రకారం. మాటేడు గ్రామానికి చెందిన రవి వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. గత ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి, ఇతర శాఖల్లో కలిపిన విషయం విదితమే. ఈ క్రమంలో తొర్రూరుఎస్సారెస్పీ కార్యాలయానికి వెళ్లిన రవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందు తూమృతి చెందాడు. మృతుడికి భార్య అరుణ, కుమారుడు జశ్వంత్, జెసిక ఉన్నారు.

21న విద్యుత్ వినియోగదారుల సదస్సు


మాట్లాడుతున్న ఏఈ పాండునాయక్

నర్సింహులపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నగూడూరు మండల కేంద్రంలో 21న విద్యుత్ వినియోగదారుల సదస్సు ఏర్పాటు చేసినట్లు ఏఈ పాండునాయక్ తెలిపారు. నర్సింహులపేట విద్యుత్ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడారు. నర్సింహులపేట, చిన్నగూడూరు, మరిపెడ మండలాల పరిధిలో విద్యుత్ వినియోగదారుల కోసం చిన్నగూడూరు విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ పునరుద్దరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చుటలో వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపులోడ్ క్రమబద్దీకరణ, సర్వీసు పేరు మార్పుట, కేటగిరి మార్పు లాంటి సమస్యలు ఉంటే వినియోగదారులు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలన్నారు.

గీత కార్మికుల హక్కుల కోసం ఉద్యమిద్దాం


మాట్లాడుతున్న తండా సతీష్‌గౌడ్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని తెలంగాణ గీత పనివారల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తండా సతీష్‌గౌడ్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మండలం ముడుపుగల్ గ్రామంలో తెలంగాణ గీత పనివారల సంఘం 67 వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు సంఘం జెండాను వేముల కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తండా సతీష్ మాట్లాడుతూ మొట్ట మొదటగా 1955 సంవత్సరంలో చేతి వృత్తి సంఘంగా గీత పనివారల సంఘం ఏర్పడిఎక్కేవాడిదే చెట్టు అనే నినాదంతో ఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. మాజీ ఎంపీ ధర్మ భిక్షం అధ్యక్షతన జిల్లాలోని గార్ల మండలంలో మొట్ట మొదటగా సంఘం మహాసభను నిర్వహించారని తెలిపారు. మద్యపాన చట్టాన్ని వ్యతిరేకిస్తూ పార్లమెంట్‌లో ధర్మ భిక్షం తన గొంతుకను విన్పించారని పేర్కొన్నారు. గౌడ సంఘం పెద్దలు జెరిపోతుల వెంకటేష్, తండా వెంకన్న, దశరధం, మల్లయ్య, వెంకన్న, రమేష్, వెంకట నారాయణ, సందీప్, గురుస్వామి, సాయి, నరహరి, దర్గయ్య, యాదగిరి, హరీష్, అజయ్, శ్రీను, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వంద రోజులు పనులను కల్పించాలి


కూలీలతో మాట్లాడుతున్న కుర్ర మహేష్

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ చట్టం ప్రకారం గ్రామాల్లో ఉపాధి హామి కూలీలకు ఏడాదిలో వంద రోజులు తప్పనిసరగి పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కుర్ర మహేష్ అన్నారు. మహబూబాబాద్ మండలం వేమూనూరు గ్రామాన్ని శనివారం వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి బృందం సందర్శించారు. అక్కడ కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్ కార్డులున్న ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించకుండా ఆటంకాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. ఆధార్‌కార్డుతో జాబ్ కార్డు నెంబరు, బ్యాంక్ అకౌంట్ నెంబరు అనుసంధానం కాకపోవడం ప్రధాన సమస్యగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఏడున్నర కోట్ల పేదల ఉపాధికార్డులు తొలగించిందని విమర్శించారు వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పులి వెంకటేశ్వర్లు, హరిసింగ్, లచ్చమ్మ, భద్రమ్మ, ధర్మ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

నర్సింహులపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 16 నుంచి జరుగుతున్న మంచినీటి సరఫరా సహాయకుల శిక్షణలో భాగంగా నాలుగో రోజు శనివారం తాగునీటి శుద్ధీకరణ, నీటి పరీక్షలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి అవగాహన కల్పించి శిక్షణా తరగతులను ముగించారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

మరిపెడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీతారాంపూర్ పీఎస్ స్కూల్ విద్యార్థులకు మరిపెడ కాంగ్రెస్ నేతలు తాజ్‌ద్దీన్, అఫ్జల్ ప్లేట్లు, గ్లాసులు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధనోపాధ్యాయుడు అర్జున్, టీచర్లు మంగీ లాల్, మహేశ్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావు, సందీప్, కవిత, ఆదిలక్ష్మి, సారిక, డాక్టర్ రాకేశ్, కాంగ్రెస్ నాయకులు గంగయ్య, లింగయ్య, బల్లెం రవి, యాకు బ్ పాష, సర్వర్, శ్రీను, మల్సూర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

'పుట్టిన ప్రతీ శిశువుకు వ్యాధి నిరోధక టీకా వేయించాలి'

మరిపెడ రూరల్, అక్టోబరు 19: పుట్టిన ప్రతీ శిశువుకు సమగ్ర వ్యాధి నిరోధక టీకా (యూనివర్శల్ ఇమ్యూనైజషన్స్ సెషన్) వేయించాలని ప్రాథమిక వైద్యాధికారి గుగులోతు రవి తెలిపారు. శనివారం మండలంలోని గిరిపురంలో జరుగుతున్న వ్యాక్సిన్ కారియర్, వ్యాక్సిన్ కండిషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పుట్టిన పిల్లల నుంచి 16 సంవత్సరాల వరకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ప్రతీ గర్భిణి తప్పనిసరిగా ప్రతీ బుధవారం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో టీకాలు వేయించుకోవాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీకుమారి, ఏఎన్‌ఎం నర్సుబాయి, నాగమణి, కవిత పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

గూడూరు. అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం వెంగంపేట గ్రామానికి చెందిన మృతుడు పత్రి నర్సయ్య కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు శనివారం రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వెంగంపేటలో శనివారం పత్రి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన దహన సంస్కారాల కోసం కాంగ్రెస్ నాయకులు రూ.10వేలు అందించారు. ఈ కార్యక్రమంలో శోభన్‌రెడ్డి, భాస్కర్, కట్ల విష్ణు, దుర్గయ్య, రాఘవరెడ్డి, వెంకట్‌రెడ్డి, యాదగిరి, రాజు, సుదర్శన్‌రెడ్డి, సాయిలు, సంతోష్, చక్ర, మంగిలాల్, సూరయ్య, బిక్కు, నర్సింహా, రామారావు, రాజశేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల నాయకుడు చిరంజీవి

కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో ఇందిరమ్మ కమిటీలు

చిన్నగూడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారుల ఎంపికలో కీలకమంటూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల ఎంపిక పూర్తిగా మండల కాంగ్రెస్ నేతలు కనుసన్నల్లో రహస్యంగా ఎంపిక చేస్తున్నారని బీఆర్‌ఎస్ మండల నాయకుడు భూక్య చిరంజీవి ఆరోపించారు. ఈ సందర్భంగా మండలంలోని మేఘ్యాతండాలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులను మండలంలోని గ్రామాల, వార్డుల వారీగా కొంతమంది మండల కాంగ్రెస్ నేతలు వారు సూచించిన వారికే ఇల్లు మంజూరు అయ్యేలా తమకు అనుకులమైన వారినే సభ్యులుగా ఎంపిక చేసి వారి వివరాలు మండల ఎంపీడీవో పంపించారని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గ్రామ కమిటీలో ఏడుగురు సభ్యులలో గ్రామ పాలన అధికారి ఛైర్మన్‌గా, కార్యదర్శి కన్వీనర్‌గా, ఇద్దరు స్వయం సంఘాల మహిళలు, మరో ముగ్గురు ఎస్సీ, ఎస్టీ, బీసీలను నియమించాలి కానీ, గ్రామస్తులకు సంబంధం లేకుండా ఐదుగురు సభ్యులను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలనే ఎంపిక చేశారని ఆరోపించారు. తక్షణమే ఆ కమిటీలు రద్దు చేసి గ్రామసభ ద్వారా కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి బాధావత్ సురేష్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బయ్యారం పీహెచ్‌సీ సందర్శన

బయ్యారం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ తిరుపతి శనివారం బయ్యారం పీహెచ్‌సీని సందర్శించారు. తొలుత పీహెచ్‌సీ ఆవరణను పరిశీలించిన ఆయన ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులును అడిగితెలుసుకున్నారు. ఆస్పత్రి నిర్వాహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాగర్, బయ్యారం ఎస్సై తిరుపతితో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పాకాల ఏటీపై వంతెన నిర్మాణానికి నిధులను విడుదల చేయాలి'

గార్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రం సమీపంలో రాంపురం వద్ద పాకాల ఏటిపై వంతెన నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరికి కృషి చేయాలని కోరుతూ శనివారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నేతృత్వంలోమంత్రి సీతక్క. ఇఎస్‌సీ పంచాయతీ రాజ్ కార్యదర్శి కనకారావుకు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం హయాంలో రూ. 15కోట్లు మంజూరి చేసినట్లు ప్రభుత్వ జీవోను జత పరుస్తూ విటిని వడుదలచేసి టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని వినతి పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలు అవసరాలకు అనుగుంగా బ్రిడ్జి నిర్మాణ అవశ్యకతను కనకారావుకు వివరించారు. గార్ల, బయ్యారం పీఏసీఎస్ ఛైర్మన్లు వడ్లమూడి దుర్గాప్రసాద్, మూల మధుకర్ రెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అంజయ్యకు గోల్డ్ మెడల్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీలో ఈనెల 16 నుంచి 19 వరకు జరిగిన తెలంగాణ స్టేట్ ఫస్ట్‌పోలీస్ డ్యూటీ మీట్‌లో భద్రాద్రిజోన్ మహబూబాబాద్ జిల్లా బీడీటీంలో విధులు నిర్వహిస్తున్న అంజయ్యకు రూంసెర్చ్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ శనివారం తెలిపారు. హైదరాబాద్‌లోని సీఐడీ చీఫ్ శిఖాగోయల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, అడిషనల్ డీజీ స్వాతి లక్రా చేతుల మీదుగా శనివారం గోల్డ్‌మెడల్ అందుకున్నారని తెలిపారు. వీఐపీలు, వీవీఐపీలు, ఒక ప్రదేశానికి వచ్చినప్పుడు ఉండే రూములో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు ఉండకుండా చూసుకునే విధానంలో తెలంగాణ రాష్ట్ర నుంచి 7 జోన్‌లు, 5 కమీషనరేట్‌లు పాల్గొనగా, జిల్లాకు చెందిన కానిస్టేబుల్ అంజయ్య గోల్డ్‌మెడల్ సాధించటం పట్ల ఎస్పీ అంజయ్యకు అభినందనలు తెలిపారు.


అడిషనల్ డీజీ స్వాతిలక్రా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ అంజయ్య

• సంక్షిప్తసమాచారం

సీపీఎం మండల ప్రధాన కార్యదర్శిగా వెంకన్న



కేసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం కేసముద్రం మండల ప్రధాన కార్యదర్శిగా గొడిశాల వెంకన్నను ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీనివాస్ శనివారం ప్రకటించారు. స్థానిక హరిహర గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన మహాసభలో 14 మందితో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. మండలకమిటీ సభ్యులుగా మార్తినేని పాపారావు, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, మోడెం వెంకటేశ్వర్లు, జల్లె జయరాజ్, తాడబోయిన శ్రీశైలం, కావటి నర్సయ్య, చాగంటి కిషన్‌తోపాటు మరో ఏడుగురిని ఎన్నుకున్నారు.

టీచర్ ఎక్సలెన్సీ అవార్డుకు శ్రీనివాస్ ఎంపిక



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న గణితశాస్త్ర ఉపాధ్యాయుడు కాసం శ్రీనివాస్ టీచర్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం విష్ణువర్దన్ శనివారం తెలిపారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్మైలైఫ్ ఫౌండేషన్, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తంగా అందించే టీచర్ ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికైన శ్రీనివాస్ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో శ్రీనివాస్ అవార్డును అందుకుంటారని తెలిపారు.

'నిరుపేదలకు సాయమందించడం వరం'

కురవి, అక్టోబర్ 19 : యూ ట్యూబర్ రఘు నిరుపేదలకు సహాయం అందించడం గొప్ప విషయ మని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. కురవిలో శనివారం సీపీఐ కాలనీలో వృద్ధురాలు పుల్లమ్మ, ఆమె ఇద్దరు మనవరాళ్లకు రెండునెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించడం అభినందనీయమన్నారు. అమెరికాలో ఉంటున్న శ్రీకాంత్‌రెడ్డి తన కుమారుడి సిద్ధాంతరెడ్డి పుట్టినరోజు పురస్కరించుకుని రఘుకు నగదు పంపస్తే ఆయన పేదలకు పంచడం ఆయన గొప్పతనానికి నిదర్శనమని కొనియాడారు. సీపీఐ నాయకులు తురక రమేష్, మిర్యాల వీరన్న, వెంకమ్మ, సరస్వతి, గట్ల విజయ, జానకి పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో శివగణేష్‌కు రజతం



కొత్తగూడ, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ గిరిజన సంక్షేమశాఖ క్రీడాపాఠశాల విద్యార్థి శివగణేష్ జాతీయస్థాయి క్రీడల్లో రజతం సాధించాడు. ఆంధ్రప్రదేష్ రాష్ట్రం గుంటూరులో నిర్వహించిన 35వ సౌత్ జోన్ జాతీయస్థాయి చాంపియన్‌షిప్ అథ్లెటిక్ ట్రాయెత్లెన్ క్రీడల్లో శివగణేష్ రజతం సాధించాడు. శివగణేష్‌ను, కోచ్ ధనాజీని హెచ్‌ఎం సారయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

నెల మాసం వ్యవధిలోనే వృద్ధ దంపతులు మృతి

నర్సింహులపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాసం రోజుల వ్యవధిలోనే వృద్ధ దంపతులు మృతి చెందిన సంఘటన నర్సింహులపేట మండలంలోని కౌసల్యదేవిపల్లిలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. కౌసల్యదేవిపల్లి గ్రామానికి చెందిన ఇస్సంపెల్లి పీరమ్మ (80) సెప్టెంబరు 25న అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మృతిని జీర్ణించుకోలేక భర్త ఇస్సంపెల్లి సాయిలు (85) ఈ నెల 10న అనారోగ్యానికి గురై మంచాన పడ్డాడు. ఆరోగ్య పరిస్థితి క్షీణించి శనివారం ఉదయం మృతి చెందాడు. మృతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. నెలరోజుల వ్యవధిలోనే వృద్ధ దంపతులు మృతి చెందడంతో కౌసల్యదేవపల్లిలో విషాదం నెలకొన్నది.